## క్లుప్తంగా

### సమస్యలపై వినతి



సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీఓ ధనలక్ష్మికి విజ్ఞప్తి చేస్తున్న ఎస్టీ కాలనీ వాసులు

**ఐరాల:** ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఎస్టీ కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ధనలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని గోవిందరెడ్డిపల్లె ఎస్టీ కాలనీలో మౌలిక వసతులపై ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్టీ కాలనీవాసులు డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని, నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాలని, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని ఆమెకు విజ్ఞప్తి చేశారు. ఎంపీడీఓ స్పందిస్తూ వెంటనే సంబంధిత సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి గిరికి ఆదేశించారు. కార్యక్రమంలో ఆత్మ మాజీ చైర్మన్ రాజేష్‌రెడ్డి, సచివాలయం మహిళా పోలీస్ రాజేశ్వరి పాల్గొన్నారు.

### గర్భిణులకు ఆరోగ్య నియమాలపై అవగాహన



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

**యాదమరి:** గర్భిణులు ఆరోగ్య నియమాలను తప్పనిసరిగా పాటించాలని, తద్వారా మాతా శిశు మరణాలను తగ్గించవచ్చని డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ చెప్పారు. మంగళవారం ఆయన సంతగేటులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. గర్భస్థ సమయంలో మధుమేహం, అధిక రక్తపోటు, రక్తహీనత శిశువుకు, తల్లికి చాలా ప్రమాదమని అన్నారు. అందులో భాగంగానే మాతా శిశు మరణాలను అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం పీఎంఎస్ఎంఏ కార్యక్రమాన్ని ప్రతి నెల 9న చేపడుతోందని చెప్పారు. అంగన్‌వాడీల ద్వారా అందిస్తోన్న పౌష్టికాహారాన్ని, మందులు తీసుకోవడంలో అశ్రద్ధ వహించకుండా నిత్యం వాడాలని ఈ సందర్భంగా గర్భిణులకు సూచించారు. అనంతరం గర్భిణులకు స్కానింగ్, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం దాదాపు 63 మంది గర్భిణులకు రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శ్రీనివాసమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

### గ్రామ సంఘాల సభ్యులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న సాయిసుధ

**గుడిపాల:** గ్రామైక్య మహిళాసంఘాలు అభివృద్ధి చెందితేనే మండల సమాఖ్య మరింత అభివృద్ధి చెందుతుందని.. అందుకే ఆయా సంఘాల లీడర్లు, సభ్యులు తమ సంఘాలను మరింత బలోపేతం చేసుకోవడానికి కృషి చేయాలని వెలుగు ఏపీఎం సాయిసుధ, సీసీ సహదేవ్, సంఘమిత్ర హాస్యలత తెలిపారు. మంగళవారం మండలంలోని చిత్తపారలో మహిళా సంఘాల వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్యులు తీసుకున్న రుణాలను వాయిదాల్లో సకాలంలో చెల్లిస్తే వడ్డీలేని రుణాలు వస్తాయన్నారు. ఎప్పటికప్పుడు యానిమేటర్లు, సీసీల ద్వారా వివరాలను తెలుసుకోవాలన్నారు. అనంతరం ఈ సంవత్సరం వచ్చిన ఆదాయ వివరాలను చదివి వినిపించారు.

### వివాహిత అదృశ్యం

**బంగారుపాళెం:** తన భార్య అదృశ్యం కావడంపై ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మల్లప్ప తెలిపారు. వివరాలు ఇలా.. మండలంలోని కాటప్పగారిపల్లె పంచాయతీకి చెందిన ఓ మహిళ ఈ నెల 6వ తేదీన నైట్ డ్యూటీకి అని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆమె కోసం కుటుంబ సభ్యులు రెండు రోజుల పాటు బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఆరా తీశారు. చుట్టుపక్కల వెతికినా కనిపించక పోవడంతో ఆ మహిళ భర్త మంగళవారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

### గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

**తవణంపల్లె:** మండలంలోని మైనగుండ్లపల్లె, సరకల్లు గ్రామాల్లో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది రోగులకు వైద్యం పరీక్షలు చేసి సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు, వృద్ధులకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి అవసరమైన మాత్రలు అందజేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు, 104 సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.



ఓంశక్తి మారియమ్మ ఆలయం వద్ద రైతులు, నాయకులను చెదరగొట్టేందుకు యత్నిస్తున్న పోలీసులు



ఆర్డీఓ కార్యాలయం వద్ద మహిళలు, నాయకులు, రైతులను అడ్డగిస్తున్న పోలీసులు



వైఎస్సార్‌సీపీ నేతలను నిర్బంధిస్తున్న పోలీసులు

# రైతుల పాలిట కూటమి క్రూరత్వం

- అన్నదాతలకు అండగా వైఎస్సార్‌సీపీ
- అన్నదాత పోరుకు అడుగడుగునా పోలీసుల ఆంక్షలు, బెదిరింపులు
- రైతుల సమస్యలను పరిష్కరించాలంటూ గళమెత్తిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, సమన్వయకర్తలు విజయానందరెడ్డి, సునీల్, కృపాలక్ష్మి



అన్నదాత పోరు ర్యాలీలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, సమన్వయకర్తలు విజయానందరెడ్డి, సునీల్, కృపాలక్ష్మి, రైతులు, నాయకులు

**చిత్తూరు కలెక్టరేట్/చిత్తూరు కార్పొరేషన్:** రైతుల పట్ల కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ వైఖరి.. వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తుండడంతో పాటు యూరియా కొరతతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన అన్నదాత పోరు ర్యాలీతో చిత్తూరు జనసంద్రమైంది. చిత్తూరు డివిజన్ పరిధిలో చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం చిత్తూరు జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. రైతుల పక్షాన చిత్తూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట శాంతియుత నిరసనలు చేపట్టిన వైఎస్ఆర్‌సీపీ నాయకులను కూటమి ప్రభుత్వం పోలీసుల ద్వారా అడుగడుగునా అడ్డుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేసింది. డ్రోన్‌తో వీడియోలు చిత్రీకరించి కార్యక్రమంలో పాల్గొనే వారిపై కేసులు పెడతామంటూ బెదిరింపులకు దిగారు. పోలీస్ యాక్ట్ అమలులో ఉందంటూ ర్యాలీకి అడ్డంకి కలిగించారు. అయినా రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు భయపడలేదు.

**ర్యాలీ ప్రారంభం నుంచే ఆటంకాలు**

జిల్లా కేంద్రంలోని గంగినేనిచెరువు వద్ద ఉన్న ఓం శ్రీ శక్తి మారియమ్మ దేవస్థానం వద్దకు రైతులు, పార్టీ నాయకులు పూజలు చేసేందుకు విచ్చేశారు. అనంతరం అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహించేందుకు ఉదయం 9.30 గంటలకు సిద్ధం కాగా.. ఆ సమయంలో అక్కడ నిరీక్షిస్తున్న నాయకులను చెదరగొట్టేందుకు వందల సంఖ్యలో పోలీసులు భయానక వాతావరణం సృష్టించారు. గుంపులుగా ఉండకూడదంటూ బెదిరించారు. అయితే చిత్తూరు, పూతలపట్టు, జీడీనెల్లూరు నుంచి వందల సంఖ్యలో విచ్చేసిన రైతులు, నాయకులు ర్యాలీ ప్రారంభించారు. దీంతో కాసేపు నేతలకు, పోలీసులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా రైతుల పట్ల కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టారు.

**బ్లాక్‌మార్కెట్‌పై చర్యలేవీ ?**



బ్లాక్‌మార్కెట్‌లో యూరియా విక్రయాలు జరుగుతుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటోంది. సరిపడా నిల్వలు ముందుస్తుగా ఉంచలేకపోయారు. గత ప్రభుత్వంలో వ్యవసాయ సీజన్ ప్రారంభం కాకముందే నాటి సీఎం జగన్ రూ.13,500 రైతులకు ఇచ్చి మాట నిలుపుకున్నారు. చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట సంగతి అటు ఉంచి రైతులను అగౌరవపరిచే విధంగా మాట్లాడడం అన్యాయం.

– కృష్ణారెడ్డి, రైతు విభాగం చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షుడు

**ప్రతిపక్షం అంటే ప్రజాపక్షం**



కేసులు పెడతామని పోలీసులు రుబాబు చేయడం సరికాదు. నాయకులను అడుగడుగునా అడ్డగించడం అవమానపరిచడం ఎంతవరకు న్యాయం ? అధికారం ఎల్లకాలం ఉండదు. మర్యాదగా నడుచుకోవడం నేర్చుకోండి. ప్రతిపక్షమంటే ప్రజాపక్షం. ఎండలో యూరియా కోసం అల్లాడిపోతున్న రైతులను పట్టించుకోవడం లేదు.

– జ్ఞానజగదీష్, రాష్ట్ర అధ్యక్షుడు మొదలియార్ విభాగం

**పోలీసులది నియంత ధోరణి**



శాంతియుతంగా కార్యక్రమం చేస్తుంటే నియంతధోరణిలో పోలీసులు వ్యవహరించారు. వారం ముందు ర్యాలీకి అనుమతి కోరాం. ఇప్పుడు వచ్చి పోలీసుయాక్ట్–30 పేరిట అతి చేస్తున్నారు. రాజ్యాంగ పరిరక్షకులుగా వారు నడుచుకోవడం లేదు. రైతుల కోసం నిరసన చేస్తే తప్పా ? ప్రభుత్వం అణచివేత ధోరణితో వ్యవహరిస్తే ఉద్యమాలు పెరుగుతాయి కానీ తగ్గవు.

– సూర్యప్రతాప్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, లీగల్‌సెల్

**ఆర్డీఓ కార్యాలయం వద్ద అడ్డగింత**

వందల సంఖ్యలో అన్నదాత పోరు కార్యక్రమానికి విచ్చేసిన రైతులను, వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఆర్డీఓ కార్యాలయం వద్ద అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. కార్యాలయం లోపలకు వెళ్లే సమయంలో రాష్ట్ర మొదలియార్ విభాగం అధ్యక్షుడు జ్ఞానజగదీష్‌ను పోలీసులు అడ్డుకుని అసభ్య పదజాలంతో దూషించారు. దీంతో మరోమారు పోలీసులకు, నాయకులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అనంతరం యూరియా, రైతుల సమస్యలను పరిష్కరించాలంటూ ఆర్డీఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. నిరసన ర్యాలీలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, జెడ్పీ మాజీచైర్మన్ కుమార్‌రాజా, మాజీ అగ్రికల్చర్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ పాలేరు రామచంద్రారెడ్డి, రైతు నాయకులు కృష్ణారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, చందురాజు, నాయకులు, ప్రజాప్రతినిధులు, హరిణిరెడ్డి, లీనారెడ్డి, ప్రకాష్, జయపాల్, బాబునాయుడు, త్యాగ, సూర్యప్రతాప్ రెడ్డి, రాహుల్‌రెడ్డి, కోదండన్, గుణశేఖర్‌రెడ్డి, హరిబాబు, అన్బులగన్, శేఖర్‌రాజు, విజయ్‌కుమార్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, సుకుమార్, ప్రకాష్, రామయ్య, గోవిందన్, రాజశేఖర్‌రెడ్డి, బుజ్జిరెడ్డి, హరిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, మనోహర్‌రెడ్డి, గౌహతిరెడ్డి, కిషోర్‌రెడ్డి, రామచంద్ర, దొరబాబు, శిరీష్‌రెడ్డి, అంజలిరెడ్డి, హరీషారెడ్డి, అను, టిమ్ము, చక్రి, మురళీ, మధు, ప్రతిమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఈఓ వెంకటనారాయణ

**తవణంపల్లె:** ప్రభుత్వ పథకాలు అమలు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి గ్రామ స్వరాజ్యం కోసం మహాత్మాగాంధీ కన్న కలలను నిజం చేయాలని జిల్లా డిప్యూటీ సీఈఓ వెంకటనారాయణ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ పురోగతి సూచిక, 2025–26 ఆర్‌జీఎస్ఏ ప్రణాళిక సిద్ధం చేయడంపై ప్రజాప్రతినిధులు, అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. ప్రభుత్వాలు ఏవైనా పంచాయతీల్లోని గ్రామాల అభివృద్ధికి కోట్ల రూపాయలు వెచ్చించినా అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉందన్నారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామాల అభివృద్ధి పథకం కింది ఎంపికైన గ్రామాల అభివృద్ధికి జిల్లాలో రూ.16 కోట్లు నిధులు మంజూరైనట్లు తెలిపారు. అధికారులు ప్రజాప్రతినిధులకు తగు గౌరవం ఇవ్వాలన్నారు. శిక్షణా తరగతులకు ప్రజాప్రతినిధులు గైర్హాజరు కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీపీ ప్రతాప్‌సుందర్‌రాయల్ రెడ్డి మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రెడ్డిబాబు, డిప్యూటీ ఎంపీడీఓ మురుగేశన్, ఏపీఓ బాల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

### ప్రజలకు మెరుగైన సేవలందించాలి



పెద్దిశెట్టిపల్లె ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో పరిశీలిస్తున్న సెంట్రల్ టీం సభ్యులు

**గుడిపాల:** ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్ సర్టిఫికేషన్(ఎన్‌క్యూఏఎస్) సెంట్రల్ టీం సభ్యులు ప్రీతీ కొసింగ్, ఫైరోజ్‌ఖాన్ తెలియజేశారు. మంగళవారం గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెద్దశెట్టిపల్లెలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు కార్యాలయంలో ఫిజికల్‌గా సంబంధించిన రికార్డులను పరిశీలించారు. గ్రామంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ద్వారా ప్రజలకు ఎటువంటి సేవలు అందజేస్తున్నారని, వారికి వాటి వల్ల కలిగే ఉపయోగాలపై ఆరా తీశారు. మెరుగైన సేవలను ప్రతి ఒక్కరికీ అందించి సంతృప్తి పరచాలని తెలియజేశారు. వారితో పాటు డాక్టర్ సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఈఓ శ్రీనివాస్‌రెడ్డి

**కాణిపాకం:** వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామికి మంగళవారం మహానంది నుంచి శ్రీమహానందీశ్వర స్వామి దేవస్థాన అధికారులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈఓ శ్రీనివాస్ రెడ్డి ఆలయ అతిథి గృహం నుంచి ఆలయానికి చేరుకుని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈఓ పెంచల కిషోర్ స్వాగతం పలకడంతో పాటు స్వామి దర్శనం కల్పించారు.

### గ్రామ పంచాయతీల పురోగతిపై శిక్షణ

**గుడిపాల:** గ్రామ పంచాయతీ పురోగతిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల పరిషత్ ఏఓ కుమార్, డెప్యూటీ ఎంపీడీఓ కృష్ణప్రసాద్ తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీల పురోగతిపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏఐ వర్షన్‌కు సంబంధించి గ్రామాల్లో ఇప్పటికే 9 టీములు పని చేస్తున్నాయన్నారు. ఆయా పంచాయతీల్లో పంచాయతీల పురోగతిపై ఇప్పటికే సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. వీటన్నింటిని ఏ విధంగా ప్రణాళికలు తయారు చేసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలనే వివరించారు.

### గర్భిణులకు రక్తపరీక్షలు తప్పనిసరి

**ఐరాల:** గర్భిణులు విధిగా రక్తపరీక్షలు చేయించుకోవాలని, ఈ పరీక్షలు గర్భధారణ ప్రారంభంలోనే హెచ్ఐవీ, హెపటైటిస్ బీ, సిఫిలిస్ వంటి వ్యాధులను గుర్తించడానికి సహాయ పడతాయని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప సూచించారు. మంగళవారం పీహెచ్‌సీలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ 45 మంది గర్భిణులకు రక్తపరీక్షలు చేశామన్నారు. ఇందులో 13 మంది హైరిస్క్ గర్భిణులుగా గుర్తించామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, హెల్త్ అసిస్టెంట్ మునిరత్నం, ల్యాబ్ టెక్నీషియన్ అజార్, స్టాఫ్ నర్స్ ప్రసన్న, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## రచనలు మేధోసంపత్తిని పెంచుతాయి



మంగళవిద్యావాణి సంచికను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

**బంగారుపాళెం:** రచనలు విద్యార్థుల మేధోసంపత్తిని పెంపొందిస్తుందని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని మంగళపల్లె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవిద్యావాణి 36వ సంచికను స్థానిక సర్పంచ్ మురళి, హెచ్ఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుస్తక పఠనం, రచనలు సంపూర్ణ జ్ఞానాన్ని అందిస్తాయన్నారు. పాఠశాల ఆధ్వర్యంలో మంగళ విద్యావాణి అనే మాసపత్రిక నడపడం గ్రామానికే గర్వకారణమన్నారు. ఆ ఘనత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులదే అన్నారు. దేశంలో ఏ పాఠశాల ఇలాంటి మాసపత్రిక ఆవిష్కరించిన చరిత్ర లేదని చెప్పారు. విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి సంచిక చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పాఠశాల తరపున మాసపత్రిక కొనసాగిస్తామన్నారు. గణిత అవధాని, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు, మంగళవిద్యావాణి మాసపత్రిక ప్రారంభకులు అరుణ శివప్రసాద్ మాట్లాడుతూ, మంగళవిద్యావాణి మాసపత్రిక 35 సంచికలు విడుదల చేసినందుకు యూఎస్ఏ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిందన్నారు. మంగళ విద్యావాణి మాస పత్రిక మూడు భాషల్లో విద్యార్థులే రచయితలుగా నడుస్తుండడం, ఉచితంగా మాసపత్రిక పంపిణీ చేయడం కారణంగా ప్రపంచ రికార్డు రికార్డు సాధించిందని తెలిపారు. పాఠశాల పూర్వపు హెచ్ఎం లలిత మాట్లాడుతూ 2018 సంవత్సరం సెప్టెంబర్‌లో ప్రారంభమైన మంగళ విద్యావాణి మాసపత్రిక ప్రపంచ రికార్డు సాధించడం గర్వకారణమన్నారు. మాస పత్రికకు నలగాంపల్లెకు చెందిన ధరణిప్రసాద్ ఆర్థిక సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎం మోహనరామలింగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆర్థిక సమస్యలు పరిష్కరించకపోవడం దుర్మార్గం



రణభేరి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

**ఐరాల:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా.. ఆర్థిక పరమైన ఏ సమస్యను పరిష్కరించకపోవడం దుర్మార్గమని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఏకాంబరం అన్నారు. మంగళవారం మండలంలోని పొలకల జెడ్పీ హైస్కూల్‌లో ఆయన ఉపాధ్యాయులతో కలిసి యూటీఎఫ్ రణభేరి కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఆర్థిక, విద్యారంగ సమస్యలపై రణభేరి నిర్వహించి, బైక్ జాతాల ద్వారా ప్రభుత్వానికి నిరసన తెలియజేస్తామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ఆర్థిక సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి దేవరాజులు, అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



గుడిపాల: మాట్లాడుతున్న ఏఓ

**గుడిపాల:** ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు సాధ్యమని ఏఓ సంగీత తెలిపారు. మంగళవారం చిత్తపార గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి జీవన ఎరువులు వాడుకోవాలన్నారు. ఘన, ద్రవ, బీజ జీవామృతం, వేపగింజల కషాయం వీటిని పంటలకు వాడితే మంచి దిగుబడి వస్తుందని చెప్పారు. వేరుశనగ పంటలో తెగుళ్ల నివారణకు రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కౌలు రైతులు కార్డులు చేయించుకోవాలని సూచించారు.

**ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి**

**తవణంపల్లె:** రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి అధిక దిగుబడి సాధించాలని మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ తెలిపారు. మంగళవారం మండలంలోని నలిశెట్టిపల్లె, టి.పుత్తూరు రైతు భరోసా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సాగుపై సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. కార్యక్రమమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### నేడు బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ

**చిత్తూరు కార్పొరేషన్:** నగరంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక 33, 34 డివిజన్లలో తేనెబండలోని ధర్మరాజుల గుడి సమీపంలో కార్యక్రమం ప్రారంభమవుతుందని.. పార్టీ నాయకులు, స్థానికులుకార్యక్రమానికిహాజరు కావాలని కోరారు.

### నేడు పెంపుడు కుక్కల వైద్యశిబిరం

**బంగారుపాళెం:** పెంపుడు కుక్కల వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు బంగారుపాళెం సహాయ సంచాలకులు డాక్టర్ షేక్ ఆసీఫ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం స్థానిక ప్రాంతీయ పశువైద్యశాల ఆవరణలో ఉదయం 10 గంటలకు ఉచిత పెంపుడుకుక్కల వైద్యశిబిరం ప్రారంభం అవుతుందన్నారు. పెంపుడు కుక్కలకు ఉచితంగా నట్టల నివారణ మందు, రేబిస్ వ్యాధి రాకుండా టీకాలు వేయనున్నట్లు చెప్పారు. అలాగే పెంపుడు కుక్కల ప్రదర్శన ఏర్పాటు చేసి ఉత్తమ జాతి, ఉత్తమ నిర్వహణ గల కుక్కలను ఎంపిక చేసి బహుమతులను యజమానులకు అందజేయనున్నట్లు తెలిపారు. పెంపుడు కుక్కల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కోరారు.

### మండల మీట్ రేపు

**తవణంపల్లె:** మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రెడ్డిబాబు తెలిపారు. ఎంపీపీ ప్రతాప్ సుందర్ రాయల్ రెడ్డి అధ్యక్షతన 11వ తేదీన గురువారం ఉదయం 10.30 గంటలకు మండల మీట్ జరుగుతుందన్నారు. సమావేశానికి అన్నిశాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యురాలు, సచివాలయ సిబ్బంది తప్పక హాజరు కావాలని కోరారు.